క్లుప్తంగా

పాఠశాల గదుల పరిశీలన



తరగతి గదిని పరిశీలిస్తున్న కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్‌: పట్టణంలోని బాలాజీనగర్‌ ప్రాథమిక పాఠశాలను కడ ప్రత్యేక అధికారి వెంకట్‌ రెడ్డి శుక్రవారం సందర్శించారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులను పరిశీలించారు. గదుల పైపెచ్చులు ఊడి, ఇనుప చువ్వలు బయటకు రావడాన్ని గమనించారు. బడి పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇందులో కాంగ్రెస్‌ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌ ఉన్నారు.

బీసీ కాలనీలో తాగునీటి బోరు తవ్వకం



బోరు వేసేందుకు పూజ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ధారూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ శుక్రవారం తాగునీటి బోరు వేయించారు. మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ ఉన్నా, సక్రమంగా తాగునీటి సరఫరా అవడం లేదు. ఇదే విషయాన్ని కాంగ్రెస్‌ నాయకులు స్పీకర్‌ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే బోరు వేయించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన స్పీకర్‌కు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డిలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్‌ రాజేశ్వర్‌, కాంగ్రెస్‌ నాయకులు కిరణ్‌, బాబాఖాన్‌, టి.మల్లేశ్‌, లింగనపల్లి అశోక్‌, బి.అంజయ్య, సంగమేశ్వర్‌, మోసిన్‌, జీపీ కారోబార్‌ బిక్షపతి ఉన్నారు.

ఎంపీఓ రతన్‌సింగ్‌ బదిలీ

జీపీ కార్యదర్శులకు స్థానచలనం

తాండూరు రూరల్‌: ఎంపీఓతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం స్థానచలనం కలిగింది. ఎంపీఓ రతన్‌సింగ్‌ బదిలీపై పెద్దేముల్‌ ఎంపీఓగా వెళ్లగా.. కొడంగల్‌లో పని చేస్తున్న శ్రీనివాస్‌ తాండూరుకు వచ్చారు. వీరితో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. కొందరిని ఇదే మండల పరిధి గ్రామాలకు కేటాయించగా.. మరి కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. నారాయణపూర్‌ జీపీ కార్యదర్శి సత్యానారాయణరెడ్డి చెన్‌గేస్‌పూర్‌ గ్రామానికి వెళ్లగా.. కరుణాకర్‌ రెడ్డి మిట్టబాసుపల్లి నుంచి సిరిగిరిపేట్‌కు, పర్వాతపూర్‌ శివానీరెడ్డి చింతమణిపట్నంకు, చింతమణిపట్నంలో పని చేసిన రవి నారాయణపూర్‌కు బదిలీపై వెళ్లినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ తెలిపారు. ఖాంజాపూర్‌ కార్యదర్శి వెంకటప్ప బషీరాబాద్‌ మండలానికి, ఉద్దండాపూర్‌ కార్యదర్శి జయమ్మ యాలాల్‌కు, చెన్‌గేస్‌పూర్‌ కార్యదర్శి విశ్వనాథం నవాబ్‌పేట్‌కు, వీర్‌శెట్టిపల్లి కార్యదర్శి శృతి బషీరాబాద్‌ మండలానికి వెళ్లారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఉపాధిహామీ సిబ్బంది

కుల్కచర్ల: మొక్కలు నాటడంతో పాటు వాటి ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధి పీరంపల్లి గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకంతో పర్యావరణ కాలుష్యం తగ్గి, విస్తృతంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్‌, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్‌

కుల్కచర్ల: దోమల నివారణకు ఫాగింగ్‌ చేయిస్తున్నామని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులు, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్నామని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్‌ చేయిస్తున్నామని వెల్లడించారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతు పక్షపాతి

మిన్నంటిన రుణమాఫీ అమలు సంబురాలు

- హర్షం వ్యక్తంచేస్తున్న అన్నదాతలు, పార్టీ శ్రేణులు
- కొడంగల్‌ పేరు చరిత్రలో నిలుస్తుంది
- పోలీస్‌ హౌసింగ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గురునాథ్‌రెడ్డి



కొడంగల్‌: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గురునాథ్‌రెడ్డి తదితరులు



దోమ: బొంపల్లిలో..

కొడంగల్‌: కొడంగల్‌ పేరు చరిత్రలో నిలుస్తుందని పోలీస్‌ హౌసింగ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గురునాథ్‌రెడ్డి అన్నారు. రుణమాఫీని హర్షిస్తూ.. శుక్రవారం రైతులతో కలిసి అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం రేవంత్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వలన ఈ ప్రాంత ఖ్యాతి పెరిగిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఆయన ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్‌ ప్రభుత్వం తొలి విడతలోనే రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసిందని, ఆగస్టు 15వ తేదీలోపు రెండు లక్షలను మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏన్గుల భాస్కర్‌, కౌన్సిలర్‌ శంకర్‌ నాయక్‌, నయీమ్‌, సయ్యద్‌ మునీర్‌, అంజద్‌, హస్నాబాద్‌ పకీరప్ప, సాయిలు, వినోద్‌, శ్రీనివాస్‌రెడ్డి, ఆసీఫ్‌ఖాన్‌, షాకీర్‌ ఉన్నారు.

రైతు బాంధవుడు

నవాబుపేట: ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి.. తొలి విడతగా రైతులకు రూ.లక్ష రుణ మాఫీ చేసి, రైతు బాంధవుడని నిరూపించుకున్నాడని నారెగూడ మాజీ సర్పంచ్‌ పర్మయ్య అన్నారు. రుణమాఫీపై హర్షం వ్యక్తంచేస్తూ.. సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడారు. వానాకాలం సీజన్‌ మొదట్లో రుణమాఫీ కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో రైతులు శివరాజ్‌, అనంతయ్య, మాణిక్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నర్సింలు, పర్మరెడ్డి, నగేష్‌, పాండయ్య, ప్రేమ్‌దాస్‌, బుచ్చయ్య ఉన్నారు.

మాటకు కట్టుబడి..

దోమ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని బొంపల్లి మాజీ సర్పంచులు కోళ్ల సురేశ్‌, గందె రాములు అన్నారు. మండల పరిధి బొంపల్లిలో రుణమాఫీ పొందిన రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ హయాంలో రూ.లక్ష రుణ మాఫీ చేస్తామని చెప్పి, నాలుగేళ్ల తర్వాత విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఆ డబ్బులు వడ్డీకే సరిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌ రెడ్డి.. రుణమాఫీ చేశారని వెల్లడించారు. ఇందులో పార్టీ సీనియర్‌ నాయకులు నర్సింహారెడ్డి, జంగయ్య, రాము, శేఖర్‌, బాబు, కుర్వ రమేశ్‌, బషీర్‌, అంతిరెడ్డి, యాదయ్య, ఇంతియాజ్‌, చాకలి భాస్కర్‌, నాగయ్య, మహేశ్‌ ఉన్నారు.

కాంగ్రెస్‌కే సాధ్యం

పెద్దేముల్‌: రైతును రాజును చేయడం కాంగ్రెస్‌ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ తాండూరు నియోజకవర్గ ఏ బ్లాక్‌ అధ్యక్షుడు లోంక నర్సింలు అన్నారు. మండల పరిధి హన్మాపూర్‌, అడ్కిచెర్ల గ్రామాల్లో రుణమాఫీని హర్షిస్తూ.. రైతులు, నాయకులు సీఎం రేవంత్‌ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఇందులో మాజీ సర్పంచ్‌ వెంకట్‌, అంబు, నర్సింలు ఉన్నారు.

106 మందికి మాఫీ



సీఈఓ శ్రీనివాస్‌

తాండూరు రూరల్‌: మండల పరిధి ఎల్మకన్నె ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 106 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ అయిందని సీఈఓ శ్రీనివాస్‌ తెలిపారు. సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్‌లో 514 మంది రుణాలు తీసుకున్నారని చెప్పారు. ఇందులో 270 మంది రూ.లక్ష లోపు రుణం తీసుకోగా.. 244 మంది రూ.2 లక్షల వరకు రుణం పొందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 106 మందికి మాత్రమే రూ.62 లక్షల 73 వేలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 164 మందికి మాఫీ కాలేదని వెల్లడించారు. డిసెంబర్‌ 2018 నుంచి డిసెంబర్‌ 2023 వరకు రుణాలు పొందిన వారికి మాత్రమే మాఫీ వర్తిస్తుందని స్పష్టంచేశారు.

కర్షకుల కళ్లలో ఆనందం



యాలాల: రుణమాఫీతో అన్నదాతల కుటుంబాల్లో ఎనలేని ఆనందం నెలకొందని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, సంగెంకుర్దు మాజీ సర్పంచ్‌ కోలుకుంది హన్మంతు అన్నారు. రుణమాఫీపై హర్షం వ్యక్తంచేస్తూ ఆయన శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రూ.లక్షలోపు రుణమాఫీ చేసి, రైతు పక్షపాతి ప్రభుత్వం అని నిరూపించుకున్నారని చెప్పారు. మండలంలో మొత్తం 2,464 రైతులకు గాను రూ.14 కోట్లను ప్రభుత్వం మాఫీ చేసిందని పేర్కొన్నారు.

1,524 రైతులకు.. 685 మందికే మాఫీ

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రూ.లక్షలోపు రుణమాఫీ పొందాల్సిన రైతులు 1,524 మంది ఉండగా.. కేవలం 685 మందికే మాఫీ అయింది. ఇంకా 839 మందికి రావల్సి ఉందని సీఈఓ కె.నర్సింలు తెలిపారు. హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లో 351 మందికి గాను 144 మందికే రుణమాఫీ వర్తించిందని సీఈఓ రవి పేర్కొన్నారు. జాబితాలో తమ పేర్లు వచ్చాయా లేవా అని తెలుసుకునేందుకు రైతులు ఆయా సొసైటీల సీఈఓలను ఫోన్లలో సంప్రదిస్తున్నారు. రాని వారు నిరాశకు గురవుతున్నారు. రెండో విడతలో మిగిలిన వారందరికీ రావచ్చునని సీఈఓలు వెల్లడిస్తున్నారు.

హామీ ఇస్తే అమలు



రాపోల్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, పార్టీ శ్రేణులు

పరిగి: కాంగ్రెస్‌ పార్టీ హామీ ఇచ్చిందంటే అమలు చేసి తీరుతుందని ఆ పార్టీ నాయకులు స్పష్టంచేశారు. రుణమాఫీని హర్షిస్తూ.. పార్టీ శ్రేణులు, రైతులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల కాలంలోనే రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఇందులో యువజన కాంగ్రెస్‌ పార్టీ నాయకులు నాగవర్ధన్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌, ఖలీం ఉన్నారు.

నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం సత్య భారతి గార్డెన్‌లో శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన ఉదయం 10గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు రావాలన్నారు.

రేపు గురుపౌర్ణమి

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రంలో ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జ్ఞానకేంద్రం కన్వీనర్‌ డాక్టర్‌ సత్యనారాయణగౌడ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8.20 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, స్వామి వారికి అభిషేకం, ఓంకారం, వేద పఠనం, సాయి గాయత్రి, అష్టోత్తరం, 9గంటలకు హనుమాన్‌ చాలీసా పారాయణం, 9.20గంటలకు భజన సంకీర్తన, 9.40గంటలకు గురు పౌర్ణమి విశిష్ట సందేశం ఉంటుందని పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథిగా సీనియర్‌ న్యాయవాది, ఆధ్యాత్మికవేత్త గోపాల్‌రెడ్డి, వక్తగా వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పు శ్రీలతారెడ్డి రానున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం మంగళహారతి, సాయంత్రం 6.50 గంటలకు భజన సంకీర్తన ఉంటుందన్నారు. కావున పుర ప్రముఖులు, సాయి భక్తులు, మహిళలు, విద్యార్థులు, సేవాదళ్‌ సభ్యులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నాలని కోరారు.

వైద్య ఖర్చులకు రూ.1.5లక్షలు సాయం

పరిగి: పట్టణ కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన బాల్‌రాజ్‌గౌడ్‌ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో మెరుగైన చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంట్లోనే ఉన్నాడు. విషయం తెలుసుకన్న హెచ్‌వైడీ(హైదారాబాద్‌ యూత్‌ కరేజ్‌) స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌ సల్మాన్‌ఖాన్‌.. శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.1.5లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. పేద వారికి బాసటగా నిలిస్తే.. వారిని కాపాడిన వారమవుతామన్నారు. ఇందులో ఆదిల్‌, సోహెబ్‌ ఉన్నారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా

- తవ్వకాలను నిలిపివేసిన అధికారులు
- రెండు లారీలు జప్తు, స్టేషన్‌కు తరలింపు



తవ్వకాలను పరిశీలిస్తున్న ఏజీ నాగరాజు

తాండూరు రూరల్‌: అక్రమ మైనింగ్‌పై ఆ శాఖ అధికారులు కన్నెర్ర జేశారు. మైన్స్‌ ఏడీ, సిబ్బంది శుక్రవారం తవ్వకాల ప్రదేశంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సంగెంకలాన్‌ గ్రామ శివారులో తవ్వుతున్న నాపరాతి గనులను పరిశీలించి, తవ్వకాలకు అడ్డుకట్ట వేశారు. నాపరాతి లోడుతో వెళ్తున్న రెండు లారీలను జప్తు చేసి, కరన్‌కోట్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మైనింగ్‌ ఏడీ సత్యానారాయణ మాట్లాడారు. తాండూరు మండలం సంగెంకలాన్‌ గ్రామ శివారులో ప్రభుత్వ భూమి సర్వే నంబర్‌ 109లో నాపరాతి తవ్వకాలను నిలిపివేశామని తెలిపారు. పట్టా భూమి సర్వే నంబర్‌ 110లో తవ్వకాలను పరిశీలించామన్నారు. యజమాని వివరాలతో పాటు, రెండు లారీలు, జేసీబీ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అధునాతన పరికరం (ఎలక్ట్రానిక్‌ టోటల్‌ స్టేషన్‌ సర్వే) ద్వారా తవ్వకాల గుంతల సర్వే అనంతరం జరిమానా విధిస్తామని స్పష్టంచేశారు. అక్రమంగా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించారు. ఆయన వెంట మైన్స్‌ ఏజీ నాగరాజు, ఆర్‌ఐ నిర్మల, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌కు నివేదిక

ప్రభుత్వ, పట్టా భూమిలో మైనింగ్‌ తవ్వకాలపై పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేసి, కలెక్టర్‌, మైనింగ్‌ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు అందజేస్తామని ఏడీ సత్యానారాయణ తెలిపారు. మైనింగ్‌ తవ్వకాల గురించి పలు దినపత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్‌ సీరియస్‌ అయినట్లు అధికారులు తెలిపారు.

దాతల ఔదార్యం అభినందనీయం

మండల విద్యాధికారి హరిశ్చందర్‌



విద్యార్థులకు స్టేషనరి అందజేస్తున్న దాతలు

దోమ: పేద విద్యార్థుల అభ్యున్నతికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్‌ అన్నారు. శుక్రవారం మండల పరిధి బుద్లాపూర్‌, బ్రాహ్మణపల్లి పాఠశాల విద్యార్థులకు.. సౌదీ అరేబియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ శ్రీదేవి కుటుంబం నోట్‌బుక్స్‌, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడారు. సర్కారు బడుల్లో నిరుపేద పిల్లలు చదువుకుంటారని, అలాంటి వారికి దాతలు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిష్టాపూర్‌ కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్‌, జేఏసీ జిల్లా నాయకులు ముకుంద నాగేశ్వర్‌, రాములు, పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు మాధవులు, పాండు, సీఆర్‌పీలు రెడ్యానాయక్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కరిగేట కాదు.. రోడ్డే



దేవాలయానికి వెళ్లే కాలనీ రోడ్డు దుస్థితి

పరిగి: వానాకాలం సాగులో వరి నాట్లు వేసేందుకు చేసిన కరిగేట పొలం కాదు.. పరిగి పట్టణం నడిపొడ్డున ఉన్న కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. కాలనీకి వెళ్లేందుకు మట్టిరోడ్డే దిక్కవడంతో వర్షం పడితే రోడ్డు మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతుంది. పట్టణ కేంద్రంలోని కొడంగల్‌ రోడ్డు నుంచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే కాలనీ, పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లే దారి కూడా ఇదే. నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీ ప్రాంతంలో సీసీరోడ్డు సౌకర్యం లేక ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సీసీరోడ్డు నిర్మించాలని గతంలో పాలకులకు విన్నవించిన నేపథ్యంలో.. రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ పనులు ప్రారంభించలేదని స్థానికులు ఆరోపించారు. వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని, చిత్తడి రోడ్డుపై నడవాలంటే భయం వేస్తుందని పేర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల కృషి

- ఉద్యోగులకు బదిలీలు సహజం
- ఉపాధ్యాయుల సన్మానంలో వక్తలు



పెద్దేముల్‌: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెద్దేముల్‌: 'నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. వారి కృషితోనే విద్యార్థులు విద్యావంతులుగా, భావిభారత పౌరులుగా ఎదుగుతున్నారు. కన్నవారికి, ఉన్న ఊరికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్నారు' అని రుక్మాపూర్‌ మాజీ సర్పంచ్‌ శివలీల అన్నారు. మండల పరిధి రుక్మాపూర్‌ ఉన్నత పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు వసంత, పుష్పలతలకు మాజీ సర్పంచ్‌లు రమేష్‌కుమార్‌, శివలీల, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా.. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత వారిదేనని సూచించారు. ఉపాధ్యాయులు రమేష్‌, శివకుమార్‌ ఉన్నారు.

పూడూరులో..

పూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడికి వెళ్లినా మంచి పేరు తెచ్చుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్‌ అన్నారు. మండల పరిధి సోమన్‌గుర్తి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన అంజిలయ్య, సంగీత, నవీన్‌కుమార్‌, కృష్ణయ్య, అశోక్‌లను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఇందులో నాయకులు మాజీ సర్పంచ్‌ యాదయ్య, మల్లారెడ్డి, సుభాన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్‌ తదితరులు ఉన్నారు.

ప్రిన్స్‌పాల్‌కు..

కొడంగల్‌ రూరల్‌: మున్సిపల్‌ పరిధి పాతకొడంగల్‌ గ్రామశివారు గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్‌ బలరాంనాయక్‌ నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు.

దోమలో..

దోమ: ఉపాధ్యాయ బదిలీలు సహజమని పాఠశాల మాజీ చైర్మన్‌ యాదగిరిగౌడ్‌ అన్నారు. కిష్టాపూర్‌ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సతీష్‌కుమార్‌, ప్రవీణ్‌, సుశీల, నూతనంగా వచ్చిన రాధిక, రాజ్‌కుమార్‌, బాలకృష్ణలను ఘనంగా సత్కరించారు.



కొడంగల్‌ రూరల్‌: విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్‌ బలరాంనాయక్‌



పూడూరు: సోమన్‌గుర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు



దోమ: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ చైర్మన్‌ యాదగిరిగౌడ్‌

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

అనంతగిరి: రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే.. చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని వికారాబాద్‌ సీఐ నాగరాజు హెచ్చరించారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి ఠాణా పరిధిలోని రౌడీ షీటర్ల నివాసాలు, పని చేసే ప్రాంతాలల్లో గస్తీ నిర్వహించారు. రౌడీ షీటర్ల గురించి ఆరా తీశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు



బస్సును బయటకు తీసేందుకు యత్నిస్తున్న సిబ్బంది

దోమ: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో దిగబడింది. ఈ సంఘటన మండల పరిధి దాదాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి పట్టణం నుంచి దాదాపూర్‌ మీదుగా కోస్గి వెళ్తున్న బస్సు వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని రోడ్డు మధ్యలో వర్షపు నీరు నిలిచి ఉంది. ఇక్కడ గుంత ఉన్న విషయాన్ని గమనించని డ్రైవర్‌.. బస్సును నేరుగా ముందుకు తీసుకెళ్లాడు. దీంతో బస్సు గుంతలో కూరుకుపోయింది. డ్రైవర్‌ ఎంత ప్రయత్నించినా బయటకు రాకపోవడంతో ప్రయాణీకులను కిందకు దించి, బస్సును వెళుపలకు తీయడంతో ప్యాసింజర్స్‌ ఉపశమనం పొందారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గుంతలు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామీణ రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరారు.